సాక్షి జోగులాంబ గద్వాల

ఆదివారం : 22 : జూన్ : 2025



సమగ్ర సమాచారం

గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు తెలుసుకునేందుకు కేంద్రం ప్రత్యేక యాప్ తెచ్చింది.

వివరాలు 8లో ▸



సోమశిలలో ఉద్రిక్తత

సోమశిలలో శనివారం కాటేజీల కూల్చివేత విషయంలో ఉద్రిక్తత నెలకొంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /23.1

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపా దడపా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జోగులాంబ సన్నిధిలో ప్రముఖుల ప్రత్యేక పూజలు



అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠమైన అలంపూర్ జోగుళాంబ ఆలయాలను ఎమ్మెల్యే విజయుడు చల్లా ఆగస్త్యారెడ్డి, హరిప్రసాద్ రెడ్డితో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు. అలాగే, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. వీరితోపాటు ఆలయ అధికారి చంద్రయ్య ఆచారి ఉన్నారు.

‘సదరం’ క్యాంపు షెడ్యూల్ విడుదల

గద్వాల: జిల్లాలో దివ్యాంగులకు నూతన సర్టిఫికెట్లు, రెన్యూవల్ కొరకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి జూలై 15వ తేదీవ వరకు నిర్వహించే క్యాంపుల్లో ముందస్తుగా మీ–సేవా కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. బుకింగ్ చేసుకున్న వారు నిర్ణయించిన తేదీల్లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో హాజరు కావాలని తెలిపారు. హాజరు కాని వారిని తిరస్కరించనున్నట్లు, హాజరైన వారికి అదే రోజు సదరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ 23, 30, జూలై 2,5,7,9,14 తేదీల్లో శారీరక వికలత్వం గల వారికి, జూలై 1, 8, 15తేదీల్లో కంటి, శారీరక వికలత్వం గల వారికి, జూలై 3, 10 తేదీల్లో శారీరక మానసిక వికలత్వం, 4,11 తేదీల్లో చెవిటి, మూగ,శారీరక వికలత్వం గల వారికి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.206.70 కోట్లు జమ

గద్వాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరకు 1,57,250 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలో రూ.206.70కోట్లు నేరుగా జమ చేసినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ ప్రకటనలో తెలిపారు. రైతుభరోసా పథకం కేవలం ఆర్థిక సాయమే కాకుండా రైతుల భవిష్యత్‌పై ఆశను నింపే విధంగా తోడ్పడుతుందని తెలిపారు. వానాకాలం పంటల సాగు కోసం అవసరమైన పెట్టుబడి భారం నుంచి రైతులకు విముక్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం వరకు జిల్లాలో అర్హులైన 1,57,250మంది రైతులకు ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.206,70,04,561లను నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన అర్హత గల రైతులకు త్వరలోనే సాయం అందుతుందని పేర్కొన్నారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ

గద్వాల: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణమాఫీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చేనేతజౌళి శాఖ ఏడీ గోవిందయ్య ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో 1-4-2017 తేదీ నుంచి 31-3-2024వరకు రుణాలకు మాఫీ చేయుటకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం మార్గదర్శకాల ప్రకారం ప్రొఫార్మా 1ఏ మరియు 1బీ బ్యాంకుల్లో నుంచి వచ్చిన మిగిలిన బ్యాంకులు మంజూరుకు సంబంధించిన ఉత్తర్వులు చేనేత శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఈనెల 24వ తేదీలోగా ఇవ్వాలని, బ్యాంకులు సమర్పించిన రుణ వివరాలను డీఎల్‌సీ అనుమతితో ఈనెల 28వ తేదీలోపు ఎస్‌ఎల్‌బీసీ కి సమర్పించబడునని, లేనిచో సంబంధిత బ్యాంకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. చేనేత మరియు జౌళి శాఖ కార్యాలయం మెయిల్ అడ్రస్ jogulambadtex@gmail.com అని, బ్యాంకర్లు కార్మికుల రుణమాఫీ పథకానికి సహకరించాలని తెలిపారు.

26న జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఒకేషనల్ కళాశాలలో ఈ నెల 26న అప్రెంటిషిప్, జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ కౌసర్‌జహాన్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కో కన్వీనర్ నర్సింహులుతో కలిసి ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2023, 2024, 2025 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మేళాలో వివిధ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు.

నల్లమల రాజసం



అటవీ ప్రాంతాల్లో క్రూరమృగాల నుంచి ఎదురయ్యే ప్రమాదాలు.. వాతావరణ పరిస్థితులను ముందుగానే పసిగట్టగల తెలివితేటలు.. ఎలాంటి వాతావరణాన్ని అయినా తట్టుకోగలిగే రోగనిరోధక శక్తి.. పొద్దస్తమానం పనిచేసినా అలసిపోనితత్వం.. గుర్రాల వంటి గిట్టలతో ఎత్తైన గుట్టలు, రాళ్లు, రప్పల్లోనూ అవలీలగా పరుగెత్తగల సత్తా నల్లమల లోతట్టు ప్రాంతంలోని పొడజాతి వృషభరాజాల సొంతం.. నిటారుగా ఉండే కొమ్ములు, తెలుపు, ఎరుపు, గోధుమ రంగుల్లో ఉండే మచ్చలే మకుటంగా ధరించిన తూర్పు పొడజాతి పశువులు తెలంగాణ బ్రాండ్‌గా ప్రఖ్యాతి గడించాయి. గిత్తంటే ఇదిరా అనే రైతన్న మాటకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. నల్లమల గిత్తగా పేరొందిన ఈ వృషభరాజాలకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

– అచ్చంపేట

తెలంగాణ బ్రాండ్‌గా తూర్పుజాతి పశుసంపద

- నల్లమల లోతట్టు ప్రాంతంలో మేలుజాతి పశువులు
- మన్ననూర్ గిత్తకు వందేళ్లకు పైగా చరిత్ర
- ఆదరణ కొరవడటంతో ప్రశ్నార్థకమవుతున్న మనుగడ
- ప్రభుత్వం నుంచి ప్రత్యేక గుర్తింపు కోసం ఎదురుచూపులు

నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని చెంచుపెంటల్లో ఉండే మేలుజాతి పశువులకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. అటవీ మేతతో దృఢంగా ఉండటం.. 20–25 ఏళ్లపాటు వ్యవసాయ పనులు చేసే సామర్థ్యం వీటి సొంతం. అమ్రాబాద్, పదర మండలాల పరిధిలోని మద్దిమడుగు, ఇప్పలపల్లి, మారడుగు, ఉడిమిళ్ల, చిట్లంకుంట, వంకేశ్వరం, పదర, లక్ష్మాపూర్, తిర్మలాపూర్, ఉప్పునుంతల, మాధవానిపల్లి, అమ్రాబాద్, మన్ననూర్, వట్టువర్లపల్లి, దోమలపెంట గ్రామాలతోపాటు మల్లాపూర్, అప్పాపూర్, ఈర్లపెంట, మేడిమొల్కల, ఆగర్లపెంట, పుల్లాయిపల్లి, సంగండిగుండాలు చెంచుపెంటల్లో ఈ పశుజాతి ఉంది. ఆయా గ్రామాల రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ ప్రధాన వృత్తిగా ఎంచుకొని జీవనం సాగిస్తున్నారు.

సండే స్పెషల్

మన్ననూర్ గిత్తగా నామకరణం..

2016 డిసెంబర్ 27న అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ (బీకే)లో ఈ ప్రాంత రైతులతో కలిసి తెలంగాణ జీవ వైవిధ్య సంస్థతోపాటు వాస్సన్ స్వచ్ఛంద సంస్థ తూర్పుజాతి పశు ప్రదర్శన, పశు పెంపకందారుల సంఘం ఏర్పాటు చేశారు. ఆ రోజు నల్లమల అటవీ ప్రాంతంలోని పశుజాతికి మన్ననూర్ గిత్తగా నామకరణం చేశారు. అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. గతంలో ఒక్కో రైతుకు 100 నుంచి 300 వరకు పశువులు ఉండేవి. 50 వేలకుపైగా పశువులు ఉన్న ఈ ప్రాంతంలో ప్రస్తుతం 15 వేల వరకు మాత్రమే ఉన్నాయి. ఏటేటా ఈ అరుదైన పశుజాతి తగ్గిపోతోంది. ఇది వరకు నల్లమల అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా పశువులను మేపుకొనేవారు. అటవీశాఖ నిబంధనలు, అభ్యంతరాలతో పశుగ్రాసం కొరత ఏర్పడి.. పశుపోషణ భారంగా మారి చాలామంది వీటిని వదులుకుంటున్నారు.

కోడే దూడలకు డిమాండ్..

వ్యవసాయ అనుబంధమైన పశుపోషణలో ఈ ప్రాంత రైతులు ప్రగతి సాధిస్తున్నారు. నల్లమల తూర్పు పశుసంపదకు తెలంగాణతోపాటు ఆంధ్ర, రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. కర్నూలు, గుంటూరు, నెల్లూరు, అనంతపూర్, రాయచూర్‌తో పాటు కోస్గి, కొడంగల్ రైతులు దశాబ్దాల కాలంగా మేలుజాతి కోడెలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు ఈ ప్రాంతంలో ఉంటూ పశువులను పరిశీలించి.. తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేస్తారు. ప్రతి ఏటా దీపావళి తర్వాత జరిగే కురుమూర్తి జాతరలోనూ నల్లమల పశువులను అమ్ముతుంటారు. గతంలో జత గిత్తలకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ధర ఉండగా.. ప్రస్తుతం రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతోంది.

వ్యవసాయ పనుల్లో మంచి నైపుణ్యం..



నల్లమల పొడ పశుజాతికి మన్ననూర్ గిత్తగా గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. వీటికి వ్యవసాయ పనుల్లో మంచి నైపుణ్యం ఉంటుంది. కష్టతరమైన పనులు సులువుగా చేస్తాయి. 34 ఏళ్లగా పశువుల వ్యాపారం చేస్తున్నా. ఈ ప్రాంత రైతుల నుంచి దూడలు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో అమ్ముతా. వివిధ కారణాలతో పశుజాతి తగ్గడంతో వ్యాపారం కూడా తగ్గింది.

– గెంటెల హన్మంతు, పశువుల వ్యాపారి, తూర్పు పొడజాతి గోవు సంఘం అధ్యక్షుడు

రైతులను ప్రోత్సహించాలి..



నాకు 50 వరకు పశువులు ఉన్నాయి. నల్లమల రైతులకు పశుపోషణ భారంగా మారింది. పశుగ్రాసం, నీటి కొరత ప్రధాన కారణంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పశుజాతిని సంరక్షించేందుకు పునరావాస, పశుగ్రాసం పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పశువుల వల్ల అడవికి ఎలాంటి నష్టం ఉండదు. అడవిలో మేపుకొనేందుకు అనుమతి ఇవ్వాలి.

– శివాజీ గెలవయ్య, మన్ననూర్, అమ్రాబాద్

సంతతి పెంచేందుకు కృషి..



నల్లమల పశువులకు మంచి డిమాండ్ ఉంది. తూర్పు పొడజాతి పశుసంతతి పెంచేందుకు కృషిచేస్తాం. మన్ననూర్ గిత్తకు ప్రత్యేక హోదా కల్పిస్తాం. మచ్చల వైవిధ్యంపై పరిశోధన చేయించి, ఇక్కడ సంతనోత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. ఈ జాతిని సంరక్షించేందుకు ప్రభుత్వపరంగా చొరవ తీసుకుంటాం.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

రోగనిరోధక శక్తి ఎక్కువే..

నల్లమల పశువులకు రోగనిరోధక శక్తి అధికమే. అటవీ ప్రాంతంలో ఉండే ఔషధ మొక్కలు, రకరకాల మూలికలను ఈ పశువులు తినడం వల్ల రోగాలను తట్టుకునే శక్తి వీటికి అధికంగా ఉంటుంది. అన్ని రకాల వాతావరణాన్ని తట్టుకునే శక్తి కూడా అధికమే. తక్కువ పశుగ్రాసంతో ఎక్కువ పనిచేస్తోంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకధాటిగా పనిచేసే సామర్థ్యం వీటికి ఉంటుంది. ఈ పశువులకు త్వరగా అలసిపోయే గుణం ఉండదు. అటవీ ప్రాంతంలో పశువుల మందపై క్రూరమృగాలు దాడి చేసినా.. చురుకుగా తప్పించుకుంటాయి. తూర్పుజాతి పశువు వేడి, చలి వంటి వాతావరణం తట్టుకుని జీవిస్తాయి. ఇవీ ఎంతో తెలివైనవని.. వర్షం రాకను ముందే పసిగట్టి తమ గమ్యస్థానాలకు చేరుకుంటాయని పరిశోధనలో తేలిందని పశువైద్య నిపుణులు చెబుతున్నారు.



నల్లమల ప్రాంతంలోని తూర్పు పొడజాతి పశువులు

కొనసాగుతున్న పరిశోధనలు..

ఉమ్మడి రాష్ట్రంలో ఒంగోలు గిత్తకు ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలంగాణ నల్లమల ప్రాంతంలోని మన్ననూర్ గిత్తకు ప్రత్యేక హోదా కల్పించాల్సి ఉంది. ఈ పశుజాతిపై ఏడాదిగా ప్రత్యేక పరిశోధనలు కొనసాగుతున్నాయి. వీటికి తూర్పుజాతి పశువుగా గుర్తింపు లభించింది. రాష్ట్రానికి గర్వకారణమైన ఈ జాతికి అరుదైన గౌరవం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



జిల్లా కేంద్రంలో యోగాసనాల్లో ఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది

- ఉత్సాహంగా యోగా శిక్షణ
- జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

గద్వాలటౌన్: చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉదయం ఆరు గంటలకు ముందే యోగా సాధనకు తరలివచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం యోగా శిక్షణకు హాజరై స్ఫూర్తి కలిగించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ, పతంజలి యోగ సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు, కలెక్టరేట్ కార్యాలయం, గద్వాల లయన్స్ క్లబ్, గద్వాల వాకర్స్ గ్రూప్, స్మృతివనం సభ్యులు, సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో వేరువేరుగా ఆయా ప్రాంతాలలో నిర్వహించిన యోగా శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగింది.

■ కలెక్టరేట్ కార్యాలయంలో, స్మృతివనంలో జరిగిన యోగా దినోత్సవంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ పాల్గొని అధికారులు, ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేశారు. బీజేపీ నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్థానిక కోటలోని చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో పురుషులు, మహిళలు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

■ ధరూర్‌లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్మృతివనంలో మహిళలు, వాకర్స్ పెద్ద సంఖ్యలో హాజరై యోగాసానాలు వేశారు. క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో క్రీడాకారులు యోగా శిక్షణ శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగ శిక్షణ ఇచ్చారు. వీటితో పాటు పలు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు వారి వారి పరిధిలో యోగా శిబిరాలు నిర్వహించారు.

■ పలువురు శిక్షకులు యోగాపై మెలకువలు వివరించారు. రుగ్మతలను దూరం చేసే ఆసనాలు.. ప్రశాంతతను చేకూర్చే ప్రాణాయామం.. మనస్సును నియంత్రించే ధ్యాస.. ధ్యానం సాధనలతో జిల్లా వాసులు ఉషోదయాన సేదతీరారు. శిక్షకులు వివిధ రకాల ఆసనాలను ప్రదర్శించి ఆరోగ్యానికి అవి ఎలా.. ఉపయోగపడతాయో సవివరంగా తెలియజేశారు. ఔత్సాహికులచే ఆసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యతను వివరించడంతో పాటు.. ఈ క్రమంలోనే ప్రాథమికంగా యోగా శిక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. సుమారు రెండు గంటల పాటు యోగా సాధన చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిత్యం కొనసాగేలా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చర్యలు తీసుకోవాలని ఔత్సాహికులు కోరారు. యోగా నిత్య జీవితంలో భాగం కావాలని సూచించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం..



గద్వాలలో యోగాసనాలు వేస్తున్న ఔత్సాహికులు

గద్వాల క్రైం: మానసిక ఒత్తిళ్లు.. నిలకడ లేని ఆలోచనల నుంచి బయటపడాలంటే యోగాతోనే సాధ్యమవుతుందని జిల్లా జడ్జి ఎస్ ప్రేమలత, ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా కోర్టు, పోలీసు పరేడ్ గ్రౌండ్ ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరు తీవ్ర వేదన, చిరాకు, ఒత్తిళ్లు, ఆందోళనకు కుంగిపోతున్నారన్నారు. స్థిరత్వం లేని ఆలోచనలు, క్షణికావేశంతో చేస్తున్న పొరపాటు ద్వారా సమస్యలకు నిలయంగా ఉన్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రతి జఠిలమైన సమస్యల నుంచి విజయం సాధించాలంటే క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు. మానసిక ప్రశాంతతా, ఆనందం, సమయానుకులంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేస్తున్న పనుల్లో సంతోషం ఉంటుందన్నారు. అన్ని వయస్సుల వారు యోగా చేయడం ఆరోగ్యదాయకమన్నారు.

యోగా దినచర్యగా పాటించాలి

ఎర్రవల్లి: ప్రతి ఒక్కరికి యోగా దినచర్యగా పాటించాలని బీచుపల్లి పదో బెటాలియన్ కమాండెంట్ జయరాజు అన్నారు. శనివారం బీచుపల్లి పదో బెటాలియన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి యోగా ఆసనాలను వేశారు. యోగా వల్ల మనస్సుకు శాంతి కలగడమే గాక శరీర దృఢత్వం పెరుగుతుందని, ఆవేశం కలగకుండా ఓర్పును ఇచ్చే గొప్ప విద్య యోగానే అని అన్నారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు నరేందర్ రెడ్డి, శ్రీనివాసులు, పటాలం ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బీచుపల్లి బెటాలియన్‌లో సిబ్బందితో కలిసి ఆసనాలు వేస్తున్న కమాండెంట్ జయరాజు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

కేటీదొడ్డి: ఎన్నో ఏళ్లుగా పేదలు సొంతిళ్లు లేక పూరి గుడిసెల్లో నివసిస్తున్నారని, అలాంటి పేదలందరికీ ప్రభుత్వం రూ.5 లక్షలు ఖర్చు చేసి ఇందిరమ్మ ఇంటిని కట్టించి వారి కలను నిజం చేస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కేటీదొడ్డిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని, మండలానికి 378 ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు 45 రోజుల్లో పనులు ప్రారంభించి ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలను విడతల వారీగా అందజేస్తున్నట్లు తెలిపారు. పార్టీ ఏదైనా అభివృద్ధి ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, జిల్లా నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జంబురామన్ గౌడు, రాజశేఖర్, రామకృష్ణనాయుడు, ఉరుకుంద, టీచర్ గోవిందు, కొండన్న, యుగందర్, రఘుకుమార్ శెట్టి, నాసీర్, తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



డ్రాగాన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

ధరూరు: మండల పరిదిలోని పారుచర్ల గ్రామ శివారులో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను అదనపు కలెక్టర్ నర్సింగరావు పరిశీలించారు. శనివారం డ్రాగాన్ ఫ్రూట్స్ పండ్ల తోటను పరిశీలించి రైతు శారదమ్మను ప్రభుత్వం నుంచి అందిన ఫలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీటి ఖర్చుతో ఎక్కువ పంటలను సాగు చేసుకోవచ్చు అన్నారు. డ్రాగన్ ఫ్రూట్స్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పరికాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమయానుకూలంగా పంటకు ఎరువులు, నీళ్లు పెట్టి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ శరత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, టీఏ అలీస్ పాష, ఫీల్డ్ అసిస్టెంట్ హనుమంతు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అడ్డుకట్టపై ప్రత్యేక దృష్టి

మానవపాడు: బాల్యవివాహాలను ముందస్తుగానే గుర్తించి, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, వీటి అడ్డుకట్టకు అందరూ సమష్టిగా కృషి చేయాలని డీడబ్ల్యూఓ సునంద సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏడు మండలాల అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, 9 నెలల వరకు వివిధ దశలలో జరిగే పిండం అభివృద్ధి గురించి వివరించారు. పుట్టిన పిల్లల్లో రెండేళ్ల వరకు బ్రెయిన్ డెవలప్‌మెంట్ 75శాతం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు తప్పనిసరిగా పిల్లల ఎత్తు, బరువు సరిగా కొలవాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ ఆస్మా, లక్ష్మీదేవి, నర్గీస్, పుష్ప, జయమ్మ, బాలమ్మ, లక్ష్మి పరమేశ్వరి, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ సురేష్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు న్నారు.



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ సునంద

ఆయకట్టుకు సాగునీరు

నేడు విడుదల చేయనున్న మంత్రి వాకిటి శ్రీహరి

- జూరాల జలాశయానికి కొనసాగుతున్న వరద
- ఎడమ కాల్వ పరిధిలో 85 వేల ఎకరాలు



జూరాల ఎడమ కాల్వ

అమరచింత: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఈ ఏడాది ముందస్తుగా వరద వస్తుండటంతో ఆయకట్టుకు సాగునీరు వదిలేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వరద నీరు వృథా చేయకుండా వానాకాలం పంటల సాగుకుగాను ఆయకట్టుకు ముందస్తుగా నీటిని వదలాలని నిర్ణయించిన అధికారులు ప్రభుత్వానికి విన్నవించడంతో జూరాల ప్రధాన ఎడమ కాల్వకు ఆదివారం నీరు వదిలేందుకు ముహూర్తం ఖరారు చేశారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ఎడమ కాల్వకు నీటిని వదలనున్నారని.. ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రాజెక్టు అధికారులు వివరించారు. వానాకాలం పంటల సాగుకు ముందస్తుగా కాల్వకు నీటిని వదలడం జూరాల చరిత్రలో ఇదే మొదటిసారని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

■ గతేడాది యాసంగిలో ప్రాజెక్టులో నిల్వ నీటి మట్టం తక్కువగా ఉండటంతో తాగునీటి అవసరాల దృష్ట్యా ప్రభుత్వం ఎడమ, కుడికాల్వ ఆయకట్టును కుదించి 35 వేల ఎకరాలకే పరిమితం చేసి అతి కష్టం మీద సాగునీరు అందించగలిగింది. దీంతో యాసంగి సాగుకు దూరమైన చివరి ఆయకట్టు రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం సన్నరకం వరికి బోనస్ చెల్లిస్తుండటంతో ఆయకట్టులో కేవలం ఆ పంట మాత్రమే సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

100 కిలోమీటర్లు.. 85 వేల ఎకరాలు...

జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ద్వారా సుమారు 100 కిలోమీటర్ల పొడవునా.. 85 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపురం, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ వరకు కాల్వ వెంట సాగునీరు పారనుంది. ఏటా రెండు పర్యాయాలు వరి సాగు చేసే రైతులు కొన్నేళ్లుగా యాసంగిలో వారబందీ విధానంలో నీటిని అందిస్తున్నారు.

మంత్రి చేతుల మీదుగా విడుదల..



జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో వానాకాలం పంటల సాగుకుగాను ఆదివారం మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఎడమ కాల్వకు నీరు వదులుతున్నాం. జూన్‌లోనే ఆయకట్టుకు నీరందిస్తున్నాం. వానాకాలంలో పూర్తిస్థాయిలో నీటిని రోజు వారీగా అందించనున్నాం.

– జగన్మోహన్, ఈఈ, పీజేపీ నందిమళ్ల క్యాంపు డివిజన్







లింగాల మండలం శ్రీరంగాపూర్‌లో యోగా చేస్తున్న ఆదివాసీ యువకులు, మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో విద్యార్థుల యోగాసనాలు, మద్దూరు బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల యోగాసనం, పద్మాకారంలో కావేరమ్మపేట మైనార్టీ బాలికల గురుకుల విద్యార్థినులు



అచ్చంపేటలో నీటిలో యోగాసనం వేసిన యువతి



నవాబుపేటలో ప్రపంచ యోగా డే అక్షరాలతో..

వినూత్న యోగం

ప్రపంచ యోగా దినోత్సవాన్ని శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్న, పెద్ద తేడా లేకుండా వినూత్న రీతిలో యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. నల్లమలలో ఆదివాసీ యువకులు, పలు ప్రాంతాల్లో ఉపాధి కూలీలు సైతం యోగా సాధనలో పాలుపంచుకున్నారు. యోగా సాధకులు, విద్యార్థులు వివిధ రకాలుగా పిరమిడ్ ఆసనాలు వేసి అబ్బురపరిచారు. – సాక్షి నెట్‌వర్క్



మహబూబ్‌నగర్‌లో శిక్షకురాలి యోగాసనం

క్లుప్తంగా

బైక్‌కు అడ్డొచ్చిన కుక్క.. మహిళ దుర్మరణం

అచ్చంపేట రూరల్: బైక్‌పై నుంచి కిందపడిన మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని బొమ్మన్‌పల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, సిద్దాపూర్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దతండాకు చెందిన కాట్రావత్ దేవి (51) ఆశావర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం సిద్దాపూర్‌లో జరుగుతున్న ఆశావర్కర్ల సమావేశానికి హాజరయ్యేందుకు తెలిసిన వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా, బొమ్మన్‌పల్లి పెద్దమ్మ గుడి సమీపంలో రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపు కింద పడింది. ప్రమాదంలో దేవి తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం అచ్చంపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి సోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: కొత్తకోటకు చెందిన మల్లికార్జున్ (45) చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. రూరల్ ఎస్‌ఐ జలందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మల్లికార్జున్ శుక్రవారం రాత్రి వనపర్తి నుంచి కొత్తకోటకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని రాజపేట వద్ద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం మృతుడి కూతురు భార్గవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కార్మికుడి ఆత్మహత్య

బల్మూర్: పౌల్ట్రీఫామ్‌లో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొండారెడ్డిపల్లిలో శనివారం జరిగింది. ఎస్‌ఐ రాజేందర్ వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం మయుర్‌బంజ్ జిల్లా ధులియా గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్(36) కుటుంబంతో కలిసి కొండారెడ్డిపల్లి శివారులోని రాజేందర్‌రెడ్డికి చెందిన విలాసిత బ్రీడింగ్ చికెన్‌ఫామ్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన ప్రదీప్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య పంకజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి బలన్మరణం

గద్వాల క్రైం: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం జరిగింది. గద్వాల మండలం వీరాపురానికి చెందిన సామన్న (54) జీవనోపాధి నిమిత్తం గ్రామంలో హోటల్ నడుపుతూ జీవనం సాగించేవాడు. నాలుగు నెలల క్రితం ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రమాదంలో తలకు గాయం కావడంతో మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకుని మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో క్లీనర్ మృతి

జడ్చర్ల: జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో క్లీనర్ అసీఫ్(23) మృతి చెందాడు. సీఐ కమలాకర్ కథనం మేరకు.. జడ్చర్ల సమీపంలో రోడ్డుపై ఎలాంటి హెచ్చరికలు లేకుండా నిర్లక్ష్యంగా ఓ డీసీఎంను నిలిపారు. హైదరాబాద్ నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి డీసీఎంను ఢీకొట్టడంతో క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని జడ్చర్ల ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడు కర్ణాటక రాష్ట్రం కొప్పల్ జిల్లా జంగమార కలగుండికి చెందిన వాడిగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అరచేతిలో.. సమగ్ర సమాచారం

- అందుబాటులోకి 'మేరీ పంచాయతీ యాప్'
- నిధుల ఖర్చులో పారదర్శకతకు ప్రాధాన్యత
- ఆదాయ, వ్యయాలను తెలుసుకునే అవకాశం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను గ్రామస్తులు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయతీ(నా పంచాయతీ) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఆదాయ, వ్యయాల్లో పారదర్శకత పాటించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను పాలకవర్గాలు ఎలా ఖర్చు చేస్తాయనే సమాచారం నేరుగా తెలుసుకోవచ్చు. యాప్‌ను 2019లో రూపొందించినా సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేకపోయింది. ప్రస్తుతం సమగ్ర సమాచారంతో యాప్ అందుబాటులోకి వచ్చింది. పారదర్శక పాలన.. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలని, తద్వారా గ్రామాల్లో పారదర్శక పాలన సాగుతుందని అధికారులు చెబుతున్నారు. నిధుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండటంతో గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులు చేపడుతున్నారో గ్రామస్తులు తెలుసుకోవచ్చు. వివరాల నమోదు సమయంలోనే జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తించే అవకాశం ఉండటంతో అక్కడి పనులకు కేటాయించిన నిధులను ఇతర చోట్ల వినియోగించేందుకు వీలుండదు. పాలకవర్గాలు సైతం పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. పాలకులు, అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రశ్నించడానికి వీలవుతోంది.

కొరవడిన అవగాహన..

మేరీ పంచాయతీ యాప్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చాలా వరకు గ్రామాల్లో చదువుకున్న యువతకు తప్ప మరొకరికి ఈ యాప్ ఉన్నట్లు కూడా తెలియదంటున్నారు. యాప్‌పై అవగాహన లేక చాలామంది తమ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి వివరాలను తెలుసుకోలేకపోతున్నారు.

గ్రామం పేరు.. పిన్‌కోడ్

స్మార్ట్‌ఫోన్‌లో ప్లే స్టోర్‌కి వెళ్లి యాప్‌లో మేరీ పంచాయతీ పేరిట సెర్చ్ చేయగానే వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక లాగిన్ కావాలి. ఆ వెంటనే ఫైనాన్షియల్ ఇయర్, స్టేట్, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనిపిస్తాయి. వాటిని నమోదు చేయగానే ఆయా పంచాయతీల సమాచారం కనిపిస్తుంది. గ్రామం పేరు, లేదంటే పిన్‌కోడ్‌తో గ్రామ పంచాయతీ పూర్తి వివరాలను తెలుసుకునే వీలుంటుంది. చేసిన పనుల ఫొటోలను యాప్‌లో పొందుపరుస్తారు. పల్లె పాలనలో పారదర్శకతకు ఈసారి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

అన్ని వివరాలు నిక్షిప్తం..

గ్రామ పంచాయతీల నిధులు వివరాలు మాత్రమే కాకుండా సర్పంచ్ (ప్రస్తుతం లేరు), కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తుల వివరాలన్నీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా మంజూరు చేసే నిధుల చేశారు.. పనులు ఏ దశలో ఉన్నాయి.. దేనికి ఎంత ఖర్చు చేశారన్న వివరాలు ఇందులో నమోదై ఉంటాయి. నిధుల్లో సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు యాప్‌లో నమోదు చేస్తారు. ఇవే కాకుండా వచ్చే ఏడాది అంచనా వ్యయాల నమోదుతోపాటు గ్రామసభల వివరాలు సైతం యాప్‌లో అందుబాటులో ఉంటాయి.



మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని . దర్మాపూర్ పంచాయతీ కార్యాలయం

అందుబాటులో ఉంటుంది



ప్రభుత్వం రూపొందించిన 'మేరీ పంచాయతీ' యాప్‌లో గ్రామాల సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. నిధుల వినియోగంలో లోపాలు ఉన్నా.. అక్రమాలు జరిగినా.. యాప్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ఈ ఆధారాలతో అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

– పార్థసారధి, డీపీఓ, మహబూబ్‌నగర్

ఆదిమానవుల జీవనశైలి, ఆచారాలపై పరిశోధన

హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పుల్లారావు



నిలువురాళ్ల చరిత్రను విద్యార్థులకు వివరిస్తున్న ప్రొఫెసర్ పుల్లారావు

కృష్ణా: దక్షిణ భారతదేశంలోని ఆదిమానవుల జీవన శైలి, అంత్యక్రియల ఆచారాలపై అవగాహనతోపాటు విద్యార్థులు భౌతిక సంస్కృతి, సమాధి రకాలు, స్థల నిర్మాణ ప్రక్రియలపై అవగాహన కలిగి ఉండాలని ప్రొఫెసర్ పుల్లారావు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని ముడుమాల్ గ్రామంలో నిలువురాళ్లపై పరిశోధన చేయడానికి తెలంగాణ పురావస్తు శాఖ అధికారులతోపాటు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ అధ్యక్షుడు వేదకుమార్ ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం పురావస్తు శాఖకు సంబంధించిన విద్యార్థులతో వారు నిలువురాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో సూర్యకిరణాలు నిలువురాళ్లపై ఏ విధంగా పడుతున్నాయో పరిశీలించారు. అలాగే సమ్మర్ సోలిస్టిస్, ఈక్వినాక్స్‌లపై నిరీక్షణ ద్వారా… ద్వారామంగా పరిశోధనలు చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో కలిసి యోగా డే సందర్భంగా నిలువురాళ్ల ప్రాంతంలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జయశ్రీ, పురావస్తు శాఖ విభాగం శ్యాంసుందర్, స్వపతి, బుద్ధవనం, ఆర్కిటెక్ట్ రామరాజు, నాగేష్, తెలంగాణ హెరిటేజ్ శాఖ ప్రతినిధి, ఎంఈఓ నిజాముద్దీన్, ఉపాధ్యాయులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసు ఛేదన

- వివాహేతర సంబంధమే కారణమన్న డీఎస్పీ
- నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగిలయ్య

గద్వాల క్రైం: మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే ఆమె హత్యకు కారణమని గద్వాల డీఎస్పీ మొగిలయ్య వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం కోతులగిద్దకు చెందిన అనిత (26)కు పాతపాలెం గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులుతో కొంతకాలం కిందట వివాహమైంది. కాగా అనిత అదే గ్రామానికి చెందిన మాల దలాయి రంగస్వామితో వివాహేతర సంబంధం కొనసాగించేది. ఆమె మరొకరితో చనువుగా ఉండటంతో పలుమార్లు ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో భర్త ఈ నెల 15న హైదరాబాద్‌లో కూలీ పనులకు వెళ్లగా.. అదేరోజు రాత్రి రంగస్వామి ఇంటికొచ్చాడు. అయితే ఆమె మరొకరితో చనువుగా ఉండటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న రంగస్వామి.. ఆమె గొంతుకు చీర బిగించి హత్య చేశాడు. ఈ ఘటనపై అనిత తమ్ముడు అశోక్ ఫిర్యాదు మేరకు కేటీదొడ్డి ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రంగస్వామి అనితతో తరచూ ఫోన్‌లో మాట్లాడటాన్ని గుర్తించి శనివారం తెల్లవారుజామున సంగాల పార్కు సమీపంలో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. దీంతో నిందితుడు నేరం అంగీకరించారని.. ఐదురోజుల్లో కేసు ఛేదించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. రంగస్వామిని గద్వాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీను, ఎస్‌ఐ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్లకు జైలు శిక్ష



వేటగాళ్లను కల్వకుర్తి జైలుకు పంపిస్తున్న అటవీశాఖ అధికారులు



వేటగాళ్లు వేటాడి పట్టుకున్న ఉడుములు

మన్ననూర్: వన్యప్రాణులను వేటాడిన కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం జైలుకు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌ఓ మహేందర్ తెలిపారు. మద్దిమడుగు ఫారెస్టు రేంజ్ పరిధిలోని బాపన్‌పాడు బీట్‌లో ఇప్పలపల్లికి చెందిన మోతీలాల్, ఉడిమిళ్లకు చెందిన హన్మంతు(అటవీశాఖలో బీట్ ఆఫీసర్) 17వ తేదీన ఉడుములను వేటాడి బంధించారు. అనధికార వ్యక్తి సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది మూకుమ్మడిగా దాడులు చేసి వన్యప్రాణులతోపాటు వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నారు. అచ్చంపేట అటవీశాఖ డివిజన్ కార్యాలయం వద్ద విచారణ జరిపి కోర్టులో హాజరుపరుచగా కోర్టు జైలు శిక్ష విధించింది. అటవీశాఖ అధికారులు మల్లేశం, గణేశ్, రాజశేఖర్ రక్షణలో కల్వకుర్తి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిసర ప్రాంతం మొత్తం అటవీశాఖవారు అమర్చిన సీసీ కెమెరాల నిఘా, సిబ్బంది పర్యవేక్షణలో ఉంది. అటవీ నిబంధలకు వ్యతిరేకంగా అటవీ పరిసర ప్రాంతంలో ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

5 స్టార్ రేటింగ్.. పైసలు మాయం

ఉండవెల్లి: యాప్ డౌన్‌లోడ్ చేసుకొని 5 స్టార్ రేటింగ్ ఇస్తే డబ్బులు వస్తాయని నమ్మించి, అకౌంట్ ఖాళీ చేసిన ఘటన మండలంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ షాజియా డబ్బులు వస్తాయని ఆశ పడి జనవరి 17న మొబైల్ ద్వారా ఒక యాప్ డౌన్‌లోడ్ చేసింది. సైబర్ నేరగాళ్లు మొదట కొన్ని లింక్‌లు పంపి వాటికి 5 స్టార్ రేటింగ్ ఇస్తే మీకు నగదు బదిలీ చేస్తామని నమ్మబలికారు. అనంతరం కొన్ని టాస్క్‌ల ద్వారా కొంత నగదును షాజియాకు చెల్లించారు. అనంతరం ఆమె అకౌంట్ నుంచి సైబర్ మోసగాళ్లు రూ.28,495 కొట్టేశారు. ఇంతటి ఆగని నేరగాళ్లు రూ.68 వేలు జమ చేస్తే మొత్తం కలిపి ఒకేసారి చెల్లిస్తామని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన బాధితులు శనివారం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

జూరాలకు తగ్గిన వరద

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద శనివారం కాస్త తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 84 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 8.30 సమయంలో 72 వేల క్యూసెక్కులు ఉందన్నారు. దీంతో తెరిచిన 10 క్రస్ట్ గేట్లలో ఐదింటిని మూసివేసి మిగిలిన 5 గేట్ల నుంచి 20,070 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. విద్యుదుత్పత్తికి 36,415 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, ఆవిరి రూపంలో 44 క్యూసెక్కులు మొత్తం 57,329 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.222 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్ల ద్వారా శనివారం ఉత్పత్తి చేపడుతునట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 42.371 మి.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 47.662 మి.యూ. ఉత్పత్తి చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 90.033 మి.యూ. విద్యుదుత్పత్తి జరిగిందని చెప్పారు.

శ్రీశైలానికి 58,700 క్యూసెక్కులు..

జూరాలలో శనివారం విద్యుదుత్పత్తి చేస్తూ 20,070 క్యూసెక్కులు, ఆనకట్ట క్రస్ట్ గేట్ల ద్వారా 36,415, సుంకేసుల నుంచి 2,215 క్యూసెక్కులు మొత్తం 58,700 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరుతుంది. ప్రస్తుతం జలాశయంలో 852.9 అడుగుల నీటిమట్టం.. 86.4762 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల్లో ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల జరగలేదు.

పట్టపగలే ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రమణారెడ్డి

మిడ్జిల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాంరెడ్డిపల్లి అంజమ్మ ఉదయం 10 గంటలకకు ఇంటికి తాళం వేసి కోడలితో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లింది. ఆమె కుమారుడు నాగరాజు మధ్యాహ్నం 1 గంటకు ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 15.5 తులాల బంగారు (పుస్తెలతాడు, రెండు నాణేలు, నక్లేస్, కమ్మలు, ఉంగరం)తో పాటు రూ.17 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చాడు. డీఎస్పీ రమణారెడ్డి, సీఐ నాగేందర్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకోని క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. ఇంటి మిద్దెపై ఉన్న ఇనుపరాడ్‌తో తాళాలు పగులగొట్టి దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో విచారణకు సవాలుగా మారింది. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము దొంగలు దోచుకెళ్లారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

చేతబడి చేశాడని.. చెప్పులు మెడలో వేశారు

తిమ్మాజిపేట: చేతబడి చేశాడనే అనుమానంతో ఓ వ్యక్తికి చెప్పులు మెడలో వేసి.. గ్రామ వీధుల్లో తిప్పిన అమానవీయ సంఘటన మండలంలోని చేగుంట గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తాను తరుచుగా అనారోగ్యానికి గురవడానికి గడ్డం కృష్ణయ్య కారణమని ఆరోపిస్తూ ఈ నెల 6న గ్రామంలో పంచాయతీ పెట్టాడు. దీంతో గ్రామంలోని కొందరి ఒత్తిడిని తట్టుకోలేక కృష్ణయ్య తానే చేతబడి చేశానని ఒప్పుకోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి మెడలో చెప్పులు వేసి గ్రామంలో తిప్పుతూ దూషించినట్లు సమాచారం. అయితే ఈ ఘటన గురించి చెప్పేందుకు గ్రామస్తులు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

సోమశిలలో ఉద్రిక్తత

- హైలాండ్ రిసార్ట్‌ను కూలుస్తామన్న పంచాయతీ అధికారులు
- ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో రిసార్ట్‌లో గుమిగూడిన బీజేపీ నాయకులు



పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేస్తున్న రమేష్ కుటుంబ సభ్యులు, మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో టూరిజం కాటేజీల వద్ద గ్రామానికి చెందిన సందు రమేష్, తన తమ్ముళ్లతో కలిసి సర్వే నెం 54లో గల ప్రభుత్వ భూమిలో ఐదేళ్ల క్రితం రెండు అంతస్తుల రిసార్ట్ భవనాన్ని పంచాయతీ అనుమతులతో నిర్మించారు. 50 ఏళ్ల క్రితమే ప్రభుత్వం ఆ భూమిని తమకు అప్పగించిందని రమేష్ కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ ఆ భవనానికి అనుమతులు లేవని, అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తామని వారం రోజుల క్రితం జిల్లా పంచాయతీ అధికారి నోటీసులు ఇచ్చారు. శనివారం పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు, డీఎల్‌పీఓ, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సోమశిలకు చేరుకున్నారు. విషయాన్ని గమనించిన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు నేతృత్వంలో సోమశిలకు చేరుకున్న బీజేపీ నాయకులు అధికారులకు వ్యతిరేకంగా భవనం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సందు రమేష్ కుటుంబ సభ్యులు పెంట్రోల్ బాటిళ్లతో భవనం ఎదుట హల్చల్ చేశారు. దీంతో చేసేదేం లేక అధికారులు వెనుదిగారు.

బీజేపీ తరఫున అడ్డుకుంటాం

సందు రమేష్ అన్ని అనుమతులతో భవనం నిర్మించాడని, కానీ కక్షపరితంగా అధికార పార్టీ అండతో అధికారులు కూల్చడానికి ప్రయత్నిస్తున్నారని ఎల్లేని సుధాకర్ ఆరోపించారు. బాధితులకు అండగా బీజేపీ నిలబడుతుందని ఆయన హామీ ఇచ్చారు. అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలే తప్పా అధికార పార్టీ నాయకులకు వంత పాడుకూడదని హితువు పలికారు.

భవనానికి అనుమతులు లేవు

సోమశిలలో నిర్మాణం చేసిన సందు రమేష్ భవనానికి ఎలాంటి అనుమతులు లేవు. భవనం నిర్మించిన స్థలం ప్రభుత్వ భూమి అని స్థానిక తహసీల్దార్ ధ్రువీకరించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమించిన వారు ఎవరైనా మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఇప్పుడు కాకున్నా ఖచ్చితంగా భవనాన్ని కూలుస్తాం.

– రామ్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి